# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ఉపాధి హామీ శ్రామికులకు 3 లక్షల నుంచి 30 లక్షల రూపాయల వరకు ప్రమాద బీమా కల్పిస్తున్నామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ప్రకటించారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేయనున్నారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని రాష్ట్ర మంత్రుల బృందం వెల్లడించింది.

========================

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పార్కుల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలో తొలిదశలో పూర్తి చేసిన 11 ఎంఎస్ఎంఈ పార్కులను ముఖ్యమంత్రి ఈరోజు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్ విధానంలో ప్రారంభించారు. వీటితో పాటూ 376 కోట్ల రూపాయల విలువైన 14 ఎఫ్.ఎఫ్.సీ.లు, 25 ఎం.ఎస్.ఎం.ఈ. పార్కులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజా వేదిక సభలో ఆయన మాట్లాడుతూ.. 2028 నాటికి రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 ఎం.ఎస్.ఎం.ఈ. పార్కులను ఏర్పాటు చేయాలని పని చేస్తున్నామని చెప్పారు. పారిశ్రామిక పార్కుల వల్ల ఆయా ప్రాంతంలో ఉపాధి లభించడంతో పాటు ఆర్థిక అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు. మహిళలు కూడా ఎం.ఎస్.ఎం.ఈ. పార్కుల ఏర్పాటులో ముందుండాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ…

(వాయిస్ 31 సెకన్లు)

అంతకముందు జిల్లాలోని ఆత్మకూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక ఎస్టీ కాలనీలో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి.. వారితో మాట్లాడి కుటుంబసభ్యుల బాగోగులు

తెలుసుకున్నారు. తమ సమస్యలను వారు చెప్పుకోగా.. ప్రభుత్వం తరఫున అందించాల్సిన సహాయంపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

=======================

జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్రాభివృద్ధికి వెన్నెముకగా మారిందని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సి.కె. కన్వెన్షన్ హాలులో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో ఈరోజు ఉపముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ శ్రామికులను ఉద్దేశించి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... ఉపాధి హామీ పథకం రాష్ట్రానికి ఒక వరమని, సుమారు 75 లక్షల 23 వేల మంది శ్రామికులు ఈ కార్యక్రమం ద్వారా సొంత గ్రామాల్లోనే ఉపాధి పొందుతున్నారని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలోనే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో 10 వేల 669 కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. కూటమి ప్రభుత్వానికి ఉపాధి శ్రామికుల సంక్షేమమే ముఖ్యమని, 3 లక్షల నుంచి 30 లక్షల రూపాయల వరకు వారికి ప్రమాద బీమా కల్పిస్తున్నామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటిస్తూ...

(వాయిస్ 38 సెకన్లు)

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు అమరావతిలో పర్యటించనున్నారు. 58 వేల కోట్ల రూపాయల విలువైన రాజధాని పునర్నిర్మాణ పనులతో పాటూ పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యక్ష వ్యాఖ్యానం రేపు ఆకాశవాణి అందించనుంది. ఎఫ్ఎం గోల్డ్, ఇంద్రప్రస్థ, న్యూస్ ఆన్ ఎయిర్ యాప్, ఆకాశవాణి యూట్యూబ్ ఛానెల్స్ లో ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని వినవచ్చు.

=======================

రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభానికి విచ్చేయనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని రాష్ట్ర మంత్రుల బృందం వెల్లడించింది. ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణకు నియమించిన పయ్యావుల కేశవ్, పి.నారాయణ, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్ లతో కూడిన మంత్రుల బృందం ఈరోజు సభా వేదిక ప్రాంగణంలో సంబంధిత అధికారులతో జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించింది. అనంతరం ప్రధాన సభా వేదికను తుది దశకు చేరుకున్న ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ... రాజధాని కార్యక్రమం మనది అనే భావన అందరిలో కలిగేలా తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుండి ప్రజలు ఈ సభకు హాజరుకానున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ వివరిస్తూ....

(వాయిస్ 29 సెకన్లు)

విరామం

=======================

వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ వేవ్స్ సదస్సు ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ లో ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యింది. వేవ్స్ ప్రారంభోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ వేడుకల్లో అనేక మంది భారతీయ సినీ ప్రముఖులు భాగమయ్యారు. భారతీయ సినీ ప్రయాణంపై సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి బృందం ఇచ్చిన సంగీత ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి హాజరయిన తెలుగు నటుడు అక్కినేనీ నాగచైతన్య ఆకాశవాణితో మాట్లాడుతూ...

(వాయిస్ 20 సెకన్లు)

========================

నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలో అకాల వర్షాలు, గాలి వానతో చేతికొచ్చిన పంట నీటమునగడంపై రహదారులు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు, గాలివానతో నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని మంత్రి భరోసా కల్పించారు. అకాల వర్షాల కారణంగా జరిగిన ఆస్తి నష్టం, పంట నష్టంపై అధికారులతో ఆయన చర్చించారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 500 ఎకరాల్లో వరి, 100 ఎకరాలకు పైగా జొన్న పంట నీట మునగడంపై వ్యవసాయ శాఖ అధికారులుతో అలాగే ఉద్యాన శాఖకు సంబంధించిన పంట నష్టంపై కూడా త్వరితగతిన అంచనా వేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

========================

అందుబాటులో ఉన్న వనరులను సమర్ధవంతంగా వినియోగించుకుంటూ.. ప్రకాశం జిల్లాను అభివృద్ధిపథంలో నడిపించడానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా జోనల్ అధికారి ఎం.టి.కృష్ణబాబు అన్నారు. జిల్లాలను అభివృద్ధి పథంలో నడిపే చర్యల్లో భాగంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతి 5 జిల్లాలకు ఒక సీనియర్ అధికారిని జోనల్ అధికారిగా నియమించింది. అందులో భాగంగా ప్రకాశం జిల్లా జోనల్ అధికారిగా నియమితులైన కృష్ణబాబు ఈరోజు జిల్లాలోని మద్దిపాడు మండలంలో పర్యటించారు. తొలుత కొత్తకోట గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామంలోని డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ ను సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు పాత్రికేయులతో మాట్లాడుతూ... జిల్లాను అభివృద్ధి చేయడంతో పాటు అభివృద్ధిలో ఇతర జిల్లాలతో పోటీ పడే చూడాలన్నారు. జిల్లాలో పశుసంవర్ధక, మత్స్య, మైనింగ్ రంగాల్లో వృద్ధికి, ఉపాధికి మంచి అవకాశాలు ఉన్నాయని వీటిని సమర్ధంగా వినియోగించుకోవాలన్నారు.

========================

పార్వతీపురం మన్యం జిల్లాలో మే 10వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ వాయిదా పడిందని రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. దామోదరరావు తెలిపారు. ఈ మేరకు ఈరోజు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు వాయిదా వేశామని, జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జులై 5వ తేదీన నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా ప్రజలు అపరిష్కృతంగా ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

========================
========================